
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 16 జూన్ 2025 | 5



'తల్లికి వందనం'తో వెల్లివిరిసిన ఆనందం
» త్వరలో 'అన్నదాత సుఖీభవ'
» ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం: మంత్రి సుభాష్ 7
'అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులతో కమిటీ నియమించాలి' 7

కొండామంటే.. బంగారమాయె!

» లక్ష దాటేసిన 10 గ్రాముల బంగారం
» 24 క్యారెట్ ధర రూ.1,01,670
» 22 క్యారెట్ రూ.93,200

(రాజమహేంద్రవరం/అమలాపురం- ఆంధ్రజ్యోతి)
పసిడి ధర మిడిసిపడుతోంది. బంగారం అందని ద్రాక్షగా మారేలా ఉంది.ఎందుకంటే ఎక్కడా తగ్గుముఖం లేదు.. పెరుగుతూనే ఉంది. సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందని సరుకుగా మారిపోతోంది. ఇక బంగారం కొనలేం అన్నట్టు ధర పెరుగుతూ పోతోంది.తులం బంగారం లక్ష దాటేసింది. ధర రికార్డుస్థాయిలో పెరిగిపోతోంది. ఇంత ధరకు చేరడం ఇదే మొదటిసారని వ్యాపారులు,వినియోగదారులు చెబుతున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం మార్కెట్‌లో 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.93,200లకు చేరింది.24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర ఏకంగా రూ.లక్ష దాటేసింది. రూ.1,01,670గా ఉంది. వెండి ధర లక్షకు పైగా ఉంది.ప్రస్తుతం కిలో వెండి రూ.1,09,400గా ఉంది. శనివారం నుంచి ఈ ధరలు కొనసాగుతున్నాయి. సోమవారం తగ్గుతుందా.. పెరుగుతుందా అనేది అంచనా వేయలేని పరిస్థితి. ఇజ్రా యిల్, ఇరాన్ యుద్ధం, రష్యా, ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల మధ్య బంగారం ధరలు పెరుగుతున్నాయని చెబుతున్నారు.ఈ నెల 26వ తేదీ తర్వాత ఆషాఢమాసం వస్తుంది. బంగారం కొనుగోళ్లు ఉంటాయి. తర్వాత శ్రావణ మాసం జోరందుకుంటుంది.కానీ పెరుగుతున్న ధరలతో తమ అవసరాలు ఎలా తీర్చుకోవాలని పాలుపోని పరిస్థి తిలో మధ్య తరగతి సామాన్య ప్రజలు ఉన్నారు.

5 నెలలు..రూ.22 వేలు పెరుగుదల

ఇక జనవరి 1 నుంచి ఆదివారం అంటే జూన్ 15వ తేదీకి అంటే సుమారు 5 నెలల 15 రోజులకు 10 గ్రాముల బంగారం ధర రూ.22 వేలు వరకూ పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.93,200కు చేరింది.ఇదే బంగారం ధర జనవరి 1న కేవలం 71,150గా ఉంది.ఇక 24 క్యారెట్ బంగారం ధర ప్రస్తుతం రూ.1,01, 670 ఉండగా జనవరి 1న రూ.78 వేలు మాత్రమే. అంటే సుమారు 23 వేలు తేడా ఉంది. ప్రస్తు తం కేజీ వెండిధర రూ.లక్షా 9వేల 400గా ఉంది. జనవరి ఒకటన కేజీ వెండిధర రూ.88,400 మాత్రమే. జనవరి నుంచి ఇప్పటికి సుమారు రూ.21 వేలు పెరిగింది.



మార్కెట్లు..కళకళ!

తల్లికి వందనం.. జనం ఆనందం

తల్లికి వందనం డబ్బులతో జూన్ నెల టెన్షన్ నెమ్మదించడంతో కుటుంబమంతా ఆనందంగా కనిపిస్తున్నారు. దీనికి నగరాల్లోని ప్రధాన మా ర్కెట్లే నిదర్శనంగా చెప్పవచ్చు. రాజమ హేంద్రవరంలో పెద్ద బజారుకు వచ్చిన పలువురిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా.. తల్లికి వందనం సమయానికి అందడంతో తన ఇద్దరు మనవళ్లతో బజారుకు వచ్చానని సెయింట్ ఆన్స్‌లో చదువుతున్న విద్యార్థుల బామ్మ చెప్పారు. సీఎం చంద్రబాబు తన పిల్లలకు ఇచ్చిన డబ్బులతో వాళ్లకే సైకిల్ కొనడానికి వచ్చానని కొంతమూరుకు చెందిన ఆటో డ్రైవర్ ప్రసాద్ ఆనందంగా చెప్పారు. ఇలా తల్లికి వందనం సొమ్ములు సమయానికి పడడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆనందంగా ఖర్చు చేస్తున్నారు..దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో ఆదివారం పెద్ద ఎత్తున రద్దీ కొనసాగింది.

» జనం జేబుల్లో కాసులు గలగల
» ఆదివారమైనా రద్దీగా మార్కెట్లు
» పట్టణాలకు పల్లెవాసుల క్యూ
» చిన్నారుల్లో ఆనందం
» ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి





(రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)
మార్కెట్లు కళకళలాడాయి.. ఎటు చూసినా షాపులు జనంతో నిండిపోయాయి.. ఆదివారమైనా ఎక్కడా ఖాళీ లేదు.. పిల్లాపాపలతో పట్టణాలకు చేరుకుని చాలా మంది షాపింగ్ చేసే పనిలో పడ్డారు. సోమవారం నుంచి విద్యార్థులు పూర్తిస్థాయిలో పాఠశాలలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు షాపింగ్ చేసే పనిలో పడ్డారు. ఎక్కువగా బట్టల షాపులు,షూమార్ట్‌లు, బ్యాగ్‌ల దుకాణాలు, పుస్తకాల షాపులు కిటకిటలాడాయి. మరో వైపు ఫర్నిచర్ షాపులదీ అదే పరిస్థితి. ప్రతి ఆదివారం వాణిజ్యనగరం రాజమహేంద్రవరంలో ఈ షాపులు మూసివేసే ఉంటాయి. ఈ ఆదివారం ప్రత్యేకంగా తెరుచుకున్నాయి.

వ్యాపారుల ఆనందం..

'చాలా నెలల నుంచీ పెద్దగా బేరాలు లేవు. ఇవాళే కాస్త కుదుట పడుతున్నాం' అని ఓ వ్యాపారి అన్నాడంటే మార్కెట్లలో కళను అర్థం చేసుకోవచ్చు. మూడు జిల్లాల్లో చూస్తే అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంలో ప్రధానంగా మార్కెట్లు ఉంటాయి. కొద్ది నెలలుగా ఈ మార్కెట్లు వెలవెలబోతున్నాయి. ఈ ఆదివారం మాత్రం ఈ మార్కెట్లు రద్దీగా కనిపించాయి. ఎక్కువగా స్కూల్‌కి సంబంధించిన అవసరాల దుకణాల వద్ద జాతర మాదిరిగా జనం హడావుడి ఉంది. దీంతో వ్యాపారులు కూడా కాస్త హుషారుగా అమ్మకాలు సాగించారు. ఆదివారం కావడంలో పెద్ద షోరూమ్‌లకు మూత వేస్తారు. గతంలో మంగళవారం సెలవుగా ఉండేది. ఆదివారం ఉద్యోగులకు, పాఠశాలలకు సెలవు కావడంతో ఆ రోజున బేరం ఎక్కువగా ఉంటుందని మంగళవారం సెలవు పుచ్చుకోవడం ఉండేది. అయితే కొన్నాళ్లుగా ఆదివారం మూసేస్తున్నారు. అయితే సండే సామాన్యుడి మార్కెట్ల దెబ్బకు బేరాలు ఉండడం లేదనే ఇబ్బందితో కూడా పెద్ద షాపులు కట్టేస్తున్నారు. అక్కడక్కడా తెరిచి ఉన్న షోరూంలలో జనం టీవీలు, ఫ్రిజ్‌లు, బీరువాల వంటి ఉపకరణాలు, వంట గది సామగ్రి కొనుగోలు చేస్తూ కనిపించారు. డి.మార్ట్, రిలయన్స్, మోర్, విశాల్ తదితర షాపింగ్ మాల్స్ అయితే జనంతో రద్దీగా కనిపించాయి. ఉదయం నుంచి రద్దీ కొనసాగింది. ఇసుకేస్తే రాలనంతగా జనంతో నిండిపోయాయి. ఈ ఆదివారం వ్యాపారం డబుల్ జరిగిందనేది ఒక మేనేజర్ వాదన. కాస్త డబ్బులు ఖాతాలో ఉండడం..నాలుగు రోజులు గడిస్తే వాటికి కాళ్లు వచ్చేస్తాయనే భయంతో ఇంట్లోని ఆడవారు అవసరమైన వస్తువులు /సామగ్రిపై దృష్టి సారించినట్టు తెలు స్తోంది.మరోవైపు చిన్న చిన్న అప్పులను తీర్చుకోవడానికి తల్లికి వందనం సహకరించింద ని పలువురు వెల్లడించారు.బంగారం వస్తువుల కొనుగోలుపై కొందరు మహిళలు దృష్టి సారించారు. ఇలా తల్లికి వందనం సొమ్ములు అందరికీ ఉపకరించడంతో ఆనందంగా ఉన్నారు.

కుదుటపడిన బడ్జెట్..

ఏడాదిలో జూన్ నెల వచ్చిందంటే కుటుంబ బడ్జెట్‌కి దడ పట్టుకుం టుంది. ఒక్కో విద్యార్థికి ఎలా లేద న్నా రూ.10వేల వరకూ ఖర్చు తప్పదు.చంద్రన్న పుణ్యమా అని ఆ డబ్బులకు వెతుకులాడుకునే పరిస్థితి తప్పింది. జూన్‌లో స్కూల్ ఖర్చులతో మెయింటెనెన్స్ డబుల్ అవుతుంది.ఓ వైపు ఫీజులు కట్టుకొని మరో వైపు బ్యాగులు,షూలు, పుస్తకాలకు వెచ్చించాలి. ఎంతో కొంతలో కొత్త బట్టలు.. ఇతర ఖర్చులు మామూలే.దీంతో ఈ నెల వచ్చే సరికి సామాన్యుల బుర్ర అప్పు లోళ్ల చుట్టూ తిరుగుతుంది. ఎంతో కొంత చేబదులు పుచ్చుకుంటేనే గానీ ఖర్చులు గట్టెక్కని పరిస్థితి. తీరా స్కూలు అవసరాలు తీరాయని సేద తీరడానికి ఉండదు. నెలంతా ఇల్లు గడవాలి కదా!..అయితే ప్రభుత్వం దయ చూపడంతో పేద లు, మధ్య తరగతి జీవితాలకు ఈ నెలలో రుణం పుచ్చుకునే అవసరత తప్పింది. సీఎం చంద్రబా బు తన హామీని నిలబెట్టుకుంటూ తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో జమ చేస్తుండడంతో హుషారుగా బజారుకు వెళ్లి ఉత్సా హంగా అన్నీ కొనేసి పిల్లల ఆనందంలో తమ సంతోషాన్ని చూసుకుంటున్నారు. ఖాతాల్లో డబ్బులు గలగల లాడడంతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి.





ఇక తవ్వేయ్!

» రేపోమాపో మైనింగ్ పాలసీ
» ఏడాదిగా కొత్త లీజుల్లేవ్
» కుంటుపడిన మైనింగ్
» గత వైసీపీలో పూర్తిగా ధ్వంసం
» మార్పులతో ప్రభుత్వం శ్రీకారం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
జిల్లాలో చాలా కాలం తర్వాత మైనింగ్ సందడి మొదలు కాబోతుంది. రేపో మాపో మైనింగ్ పాలసీ మీద జీవో రాబోతుంది. గత వైసీపీ పాలనలో మైనింగ్ విధానం ధ్వంసమైన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పెద్దలే నేరుగా రంగంలోకి దిగి.. లీజుదార్లను తరిమి కొట్టేసి మైనింగ్ చేయించిన సంఘటనలు ఉన్నాయి.గత సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలో వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు కొత్త పాలసీ తెచ్చింది.కానీ ఏడాదిగా మైనింగ్ లీజులు లేవు.ఈ ఏడాది ఏప్రిల్ 29న కొత్తపాలసీపై ప్రభుత్వం ఓ సర్క్యులర్ జారీ చేసింది. దానిని జీవో రూపంలో ఒకటి రెండు రోజుల్లో జారీ చేయనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బిల్డింగ్ మెటల్, రోడ్ మెటల్, గ్రానైట్, గ్రావెల్, లేటరైట్ గనులు ఉన్న సంగతి తెలిసిందే. వీటిలో ఇప్పటి వరకూ స్వంత స్థలాలు లీజుకు తీసుకున్నవారు తప్ప.. ప్రభుత్వ స్థలాలు లీజుకు ఇవ్వలేదు.

ఉమ్మడి జిల్లాలో 250 దరఖాస్తులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 250 లీజు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.ఒకట్రెండు రోజుల్లో రాబోతున్న కొత్త మైనింగ్ పాలసీ వల్ల మళ్లీ లీజులు మొదలు కానున్నాయి.ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ) ప్రకారం 2023 మార్చి 13వ తేదీ నాటికి ఫైలైన పెండింగ్ మినరల్ కన్సెషన్ దరఖాస్తులు పరిశీలించి పరిష్కారానికి ఒక విధానం రూపొందించారు.సింగిల్ డెస్క్ పోర్టల్, మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులు గుర్తించి జిల్లా మైనింగ్ అధికారి లాగిన్‌లో ఉంచుతున్నారు. అర్హత ఉన్న దరఖాస్తులకు ఆమోదం తెలిపి అర్హత లేనివాటిని తొలగిస్తారు. అర్హత ఉన్న దరఖాస్తుదారుల నుంచి భద్రత డిపాజిట్ కట్టించుకుంటారు. మూడు నెలల్లోపు ఈ చెల్లింపులు చేయాలి. తర్వాత ఎన్‌వోసీ, డీజీపీఎస్ సర్వేలు చేస్తారు. భద్రత డిపాజిట్ చెల్లించకపోతే అర్హత కోల్పోతారు. గ్రానైట్ల మార్బుల్,బిల్డింగ్ మెటీరియల్‌కు తాజాగా దరఖాస్తు చేయాలి. ఇండస్ట్రియల్ మినరల్‌కు వేలం పద్ధతి ఉంటుంది.ఇవన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయి.

గత ప్రభుత్వంలో దోపిడీ

గత ప్రభుత్వంలో మైనింగ్ అంతా ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ పెద్దల చేతుల్లోకి పోయింది. అంతకుముందు ఎవరైనా వ్యక్తికి సొంత కొండ ఉంటే దానిని పంట సాగుకు సరిచేసుకోవడానికి తహశీల్దార్, ఇతర అధికారులకు దరఖాస్తు చేస్తే సరిపోయేది. ప్రస్తుతం సొంత భూమిలో మినరల్ ఉన్నా, కొండలు ఉన్నా, ఆయా ఎమ్మెల్యేల అనుమతి తీసుకోవాల్సి వస్తుంది. ఇటీవల అక్కడక్కడా తవ్వుతున్న గ్రావెల్, మట్టి వంటి వాటిలో కూడా లారీకి రూ.3 వేల వరకూ ఆయా ప్రాంత ప్రతినిధులు లాగేస్తుండడం గమనార్హం. గత ప్రభుత్వం సీనరేజి ప్రైవేట్ పరం చేసి కూడా బాగా దోచుకుంది. రేపో మాపో ప్రభుత్వం అమల్లోకి తీసుకురానున్న కొత్త మైనింగ్ పాలసీలో ఏ మినరల్‌ను ఏ విభాగంలో పెడతారో, ఏ ధరలు నిర్ణయిస్తారో, సీనరేజి పరిస్థితి ఏంటో అనే చర్చ ఆయా వర్గాల్లో మొదలైంది.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

అమలాపురంటౌన్,జూన్ 15(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో సోమవారం ఉదయం పదిగంటలనుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. అర్జీదారులు 1100 కాల్‌సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కారస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునన్నారు. సందేహాలను నివృత్తి చేసుకోవడంతోపాటు కొత్త ఫిర్యాదులు నమోదు చేయవచ్చునన్నారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం ప్రజా సమస్యల పరిష్కార వేదికను జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోను, 22 మండల కేంద్రాల్లోను, 4మున్సిపల్ కార్యాలయాల్లోను నిర్వహిస్తున్నామన్నారు.

వెంకన్న ఆలయంలో కలెక్టర్ దంపతుల పూజలు



ఆలయంలో కలెక్టర్ మహేష్‌కుమార్ దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఉపకమిషనరు

ఆత్రేయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చక బృందం వేదమంత్రాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వామి చిత్రపటం, శేషవస్త్రం సమర్పించారు. కలెక్టర్ దంపతులు స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సోమవారం వాడపల్లిలో జరిగే జిల్లాస్థాయి యోగాంధ్ర కార్యక్రమంపై తహశీల్దారు రాజేశ్వరరావుతో ఆయన చర్చించారు.

నేడు జిల్లాస్థాయి యోగాంధ్ర

» పాల్గొననున్న కలెక్టర్ మహేష్, ఎమ్మెల్యే బండారు



వాడపల్లిలో యోగాంధ్ర ట్రైల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి యోగాంధ్ర కార్యక్రమం సోమవారం వాడపల్లిలో ఉదయం 6గంటలకు శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదికవద్ద నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్,కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా, డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొననున్నారు. యోగాంధ్ర ట్రైల్ రన్ కార్యక్రమం ఆది వారం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరామన్, తహశీల్దారు రాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆహా లివ్!



హోప్ ఐలాండ్ తీరంలో గుడ్లు పెట్టిన ఆలివ్ రిడ్లే తాబేలు

ఆలివ్ రిడ్లే.. చేస్తోంది మేలు..

కొన్ని జీవులు చాలా తెలివిగా ఉంటాయి.. వాటి తెలివితేటలు అంచనా వేయడం అంత సులభం కాదు.. అటువంటి జీవుల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్ల గురించి చెప్పకుండా ఉండలేం.. అవి దేశవిదేశాలు తిరిగి మళ్లీ అవి ఎక్కడైతే పుడతాయో అక్కడే పిల్లలను పొదుగుతాయంటే నమ్ముతారా.. నమ్మక తప్పదు మరి.. ఎందుకంటే ఇది నిజం.. ఆ కథేమిటో తెలియాలంటే ఈ కథనం చదివేయాల్సిందే మరి.. నేడు ప్రపంచ సముద్ర తాబేళ్ల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

● 2023-24లో హోప్ ఐలాండ్‌లో 262 తాబేళ్లు 23,202 గుడ్లు పెట్టాయి.
● 2024-25లో హోప్‌ఐలాండ్‌లో 283 తాబేళ్లు 20,623 గుడ్లు పెట్టాయి.



ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ చర్యలు

» సముద్రజలాల సంరక్షణ
» మత్స్యసంపద అభివృద్ధి
» డిసెంబర్ - మే మధ్య సంచారం
» గుడ్లు పెట్టి సంతానోత్పత్తి
» కాకినాడ,కోనసీమలో సంరక్షణ
» నేడు ప్రపంచ సముద్ర తాబేళ్ల పరిరక్షణ దినోత్సవం

ఉప్పలగుప్తం/కాట్రేనికోన/కాకినాడ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సముద్ర జలాలు కలుషితం కాకుండా.. మత్స్యసంపద అభివృద్ధికి సహకరించే సముద్రపు జీవుల్లో ప్రత్యేకమైనవి ఆలివ్ రిడ్లే తాబేళ్లు. తీరానికి దూరంగా సముద్రపు లోతుల్లో జీవించే ఈ తాబేళ్లు సాగర జీవుల ఆహార గొలుసులో కీలకపాత్ర పోషిస్తాయి.సముద్రపు నాచు తింటూ.. జలాలను శుభ్రపరుస్తాయి. సముద్రంలో తాబేళ్ల సంఖ్య తగ్గిపోతే ఎదురయ్యే ప్రమాదాలను గుర్తించిన ప్రభుత్వం ఏటా వీటి సంరక్షణకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏడు రకాల సముద్రపు తాబేళ్లు ఉంటాయి. మన భారతదేశ సముద్ర జలాల్లో ఐదు రకాల సముద్రపు తాబేళ్ల ఉన్నాయి. వాటిలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఒకటి. ఈ జాతి ఆడ, మగ తాబేళ్లు ఏటా డిసెంబర్ మాసంలో సంతానోత్పత్తికి సముద్రంలో కలుసుకుంటాయి. కొన్నిరోజులపాటు తీర ప్రాంతంలో సంచరిస్తాయి. జనవరి మొదటివారం నుంచి ఆడ తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు సిద్ధమవుతాయి. ఫిబ్రవరి నెలలో భారీగా గుడ్లు పెట్టి.. ఏప్రిల్ నాటికి పూర్తిగా ఆపేస్తాయి. ఇవి పెట్టిన గుడ్లు పొదిగి పిల్లలుగా మారేందుకు సుమారు 40 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. ఈ ప్రక్రియ డిసెంబర్ నుంచి మే వరకు జరుగుతుంది.ఈ ఆరు నెలల్లో ఆలివ్ రిడ్లే సంతానోత్పత్తి జరుగుతుంది.కోనసీమ జిల్లాలో ఐదు ప్రాంతాల్లో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల హేచరీలున్నాయి.

కాకినాడ, కోనసీమ తీరాలకు..

సంతానోత్పత్తి సమయంలో ఈ ఆలివ్ రిడ్లే తాబేళ్లు కాకినాడ హోప్‌ఐలాండ్, కోనసీమ జిల్లాలోని ఎస్.యానాం, వాసాలతిప్ప, జీకే పోర, సాక్రిమెంట్ ఆయిల్ పలు తీరప్రాంతాలకు పెద్ద ఎత్తున వస్తుంటాయి.ప్రధానంగా డిసెంబర్ నెలలో 15-20 రోజులపాటు తీర ప్రాంతాల్లో ఇవి ఉంటాయి. మగ తాబేలు సముద్రంలోకి వెళితే.. కేవలం ఆడ తాబేళ్లు మాత్రమే తీరంలో ఉంటూ గుడ్లను పెట్టి తిరిగి వెళ్లిపోతాయి. అడుగు నుంచి అడుగున్నర లోతు గొయ్యిని తవ్వుకుని..వాటిలో 60 నుంచి 160 వరకు గుడ్లు పెడతాయి.ఈ సమయంలో గుడ్లు రూపాంతరం చెందుతాయి. 28 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కన్నా తక్కువుంటే ఆ సమయంలో పెట్టిన గుడ్లన్నీ మేల్ జాతికి చెందినవిగా, 30 డిగ్రీల ఉష్ణోగ్రతపైబడి ఉన్న సమయంలో పొదిగిన గుడ్లు ఆడ తాబేళ్లుగా మారతాయి. 28-30 డిగ్రీ మధ్య ఉష్ణోగ్రతలో జన్మించిన తాబేళ్లు అటు మేల్ అయినా కావొచ్చు. ఇటు ఫిమేల్ అయినా కావొచ్చని శాస్త్రవేత డి.మహేష్‌బాబు తెలిపారు.

ఒడిశా టు కాకినాడ..

ఆలివ్ రిడ్లే తాబేళ్ల జీవన విధానం, పునరుత్పత్తి గురించి పరిశోధనలు జరుగుతున్నాయి.అట్లాంటిక్, పసిఫిక్, హిందూ మహాసముద్రం నుంచి ఇవి వేల కిలోమీటర్ల ప్రయాణం చేసి ఇక్కడికి చేరుకుంటాయి. ఒక తాబేలు ఒడిశాలో కేంద్రపడ జిల్లా గహీర్ మత్ వద్ద సముద్రంలో ప్రయాణం ప్రారంభించి 51 రోజుల తర్వాత శ్రీలంక, తమిళనాడు, పుదుచ్చేరిల మీదుగా ఇది ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరుకుంది. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్యాగ్ దీనికి అమర్చి పరిశీలించగా ఈ విషయం తెలిసిందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.వాటికి అనుకూలమైన వాతావరణం ఉన్న కాకినాడ హోప్ ఐలాండ్‌తో పాటు కోనసీమలోని పలు తీర ప్రాంతాల్లో ఇవి సంతానోత్పత్తి చేపడతాయి.

ఆ రెండింటి మధ్య వ్యత్యాసాలివే..

ఆలివ్ రిడ్లే తాబేళ్ల ఏ తీరానికి పడితే ఆ తీరానికి రావు. ఒకసారి ఎక్కడైతే సంతానోత్పత్తి కోసం గుడ్లు పెట్టాయో.. తిరిగి అదే ప్రాంతానికి వస్తాయి. సాధారణ తాబేళ్ల కన్నా ఇవి పరిమాణంలో పెద్దగా ఉంటాయి. ఇవి 35 నుంచి 50 కిలోల బరువుతో సముద్రపు నీటిలోనే ఉంటాయి. తాబేళ్లు తీరానికి చేరుకునే సమయంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో బోట్లు తిరగకుండా, చేపల వేట నిలిపివేసేలా చర్యలు తీసుకుంటున్నామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. తాబేళ్ల రాకకు ఏటా అటవీశాఖ అధికారులు బేస్ క్యాంపులు సిద్ధం చేస్తున్నారు.ఏటా తాబేళ్ల రాక సంకేతాలను గుర్తించి బీచ్ పరిసర ప్రాంతాలు శుభ్రం చేస్తున్నారు.గుడ్లు పెట్టేందుకు అనువైన వాతావరణం కల్పిస్తున్నారు.



సంరక్షణకు ప్రత్యేక చర్యలు

1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం.. సముద్ర తాబేళ్లను సంరక్షణకు అటవీశాఖ చర్యలు చేపడుతోంది. హేచరీలను ఏర్పాటు చేసి వాటి సంతతిని పెంచే ప్రయత్నాలు చేస్తున్నాం. కాకినాడ హోప్‌ఐలాండ్‌లో మత్స్యకార కుటుంబాలకు వీటి సంరక్షణ బాధ్యత అప్పగించి, వారికి జీవనోపాధి కల్పిస్తున్నాం. ఆరుగురు బృందంగా బేస్‌క్యాంపులు ఏర్పాటు చేసి వాటిని సంరక్షిస్తున్నాం,

- ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, కోరింగ వైల్డ్ లైఫ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



జల జోష్!

యువత అంటేనే జోష్. అలాంటి నదిలో స్నానాలంటే రెట్టించిన ఉత్సాహంతో ఉరకలు వేస్తుంటారు. దానికి నిదర్శనమే ఈ చిత్రాలు. రాజమహేంద్రవరం గోదావరి పుష్కర్ ఘాట్‌లో యువకులు చేస్తున్న జల విన్యాసాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

పాపికొండలకు 196 మంది పర్యాటకులు



పాపికొండలకు వెళ్తున్న పర్యాటక బోటు

దేవీపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పాపికొండల విహారయాత్రకు ఆదివారం 5 బోట్లలో 196 మంది పర్యాటకులు వెళ్లారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ప్రకృతి అందాలు ఆస్వాదించేందుకు పర్యాటకులు దేవీపట్నం మండల పరిధిలో ఉన్న పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి పేరంటాలపల్లి వెళ్లి సందడి చేశారు. మాతృశ్రీ గండిపోశమ్మను దర్శించుకుని పాపికొండలకు వెళ్లారు. ఆలయానికి రూ.20,800 ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. భక్తులకు గోదావరిలో స్నానాలచరించేందుకు వెళ్లనీయకుండా పోలీసు, ఆలయ సిబ్బంది గస్తీ ఏర్పాటు చేశారు.

ముగిసిన సుదీర్ఘ విరామం

వేటకు పయనం..



కొత్తపల్లి మండలం రామన్నపాలెం ఉప్పుటేరులో లంగరు వేసిన బోట్లు



తొండంగిలో వేటకు వెళ్తున్న మత్స్యకారులు

కొత్తపల్లి/ తొండంగి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సుమారు 61 రోజుల సుదీర్ఘ విరామం అనంతరం మత్స్యకారులు శనివారం తెల్లవారు జామున సముద్రం పైకి వేటకు వెళ్లారు. బోట్లలో ఆయిల్ నింపి, తినడానికి సామాన్లతో బయలుదేరారు. కాకినాడ జిల్లా కొత్తపల్లిలో, తొండంగి తీరంలో ఆదివారం పూర్తిస్థాయిలో వేటకు బయలుదేరి వెళ్లారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ చేపల వేటపై నిషేధం ఉండడం వల్ల వేట సాగలేదు. ప్రభుత్వం ఈ ఏడాది వేట విరామ పరిహారంగా రూ.20వేలు అందించడంతో మత్స్యకారులు ఊరట చెందారు. వేటే ప్రధాన జీవనాధారంగా గల మత్స్యకారులు నిషేధ సమయం ముగియడంతో గంగమ్మకు పూజలు చేసి వేట ప్రారంభించారు. తొండంగి మండలంలో అద్దరిపేట నుంచి చోడిపల్లి పేట వరకూ ఉన్న 2763 మంది బోట్ల ద్వారా వేట సాగించే మత్స్యకారులు పనిలో నిమగ్నమయ్యారు. వాతావరణం కొంత మేరకు అనుకూలంగా లేకున్నా సెంట్‌మెంట్ ప్రకారం వేట సాగించే పనికి శ్రీకారం చుట్టారు. అయితే ఆశించినంతగా మత్స్య సంపద లభ్యం కాకపోవడంతో నిరాశగా ఒడ్డుకు చేరారు.

ఉప్పాడలో ఎగసిపడుతున్న అలలు



కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో రోడ్డుపైకి ఎగసిపడుతున్న కెరటాలు

కొత్తపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. అల్పపీడనంతో సంబంధం లేకుండా కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ శివారు కొత్తపట్నం సమీపంలో సముద్రం లోపలి నుంచి కెరటాలు విరుచుకుపడి గట్టును దాటి బీచ్ రోడ్డును తాకడంతో ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాన్న తిరిగొచ్చాడు

ఫాదర్స్ డే ఆనందమిచ్చాడు

పిఠాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఇంటి నుంచి వెళ్లిపోయినా పిల్లలపై బెంగ, మమకారం పోలీసుల చొరవ ఆ వ్యక్తిని తిరిగి రప్పించాయి. ఫాదర్స్ డే రోజున తండ్రిని తిరిగి కలుసుకున్న ఆ పిల్లల్లో ఆనందం వ్యక్తమైంది. కాకినాడ జిల్లా పిఠాపురం డ్రైవర్స్ కాలనీకి చెందిన గీసాల శ్రీనివాస్ (39) మే 29న తన స్నేహితుడైన కాకి రమణ మోటారుసైకిలు తీసుకుని ధవళేశ్వరంలో ఒక వ్యక్తి డబ్బులు ఇవ్వాలని చెప్పి వెళ్లాడు. సాయంత్రం 4 గంటల వరకు భార్యతో ఫోనులో మాట్లాడి తర్వాత స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అనుమానం వచ్చిన భార్య లక్ష్మి బంధువుల సహాయంతో వెదకగా తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద శ్రీనివాస్ తీసుకువెళ్లిన బైక్, దుస్తుల బ్యాగు, చెప్పులు కనిపించాయి. దీనిపై మే 31న లక్ష్మి భర్త అదృశ్యంపై పిర్యాదు చేయగా పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 3 బృందాలను ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేపట్టారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద బైకు, దుస్తులు, ఇతర వస్తువులు వదిలిన అనంతరం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ వరకు వెళ్లినట్టు గుర్తించారు. అప్పుల బాధ నుంచి విముక్తి పొందాలనే ఉద్దేశ్యంతో అక్కడి నుంచి కాశీ వెళ్లినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. అతడిని కాంటాక్ట్ చేసే రప్పించేందుకు పోలీసులు ప్రయత్నించారు. అదే సమయంలో భార్య, పిల్లలపై బెంగతో శ్రీనివాస్ ఆదివారం పిఠాపురం తిరిగివచ్చాడు. ఫాదర్స్ డే రోజున శ్రీనివాస్‌ను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. తమ తండ్రి తిరిగి రావడంతో ఆ పిల్లలు ఎంతో సంబరపడ్డారు. తండ్రిని తమ చెంతకు చేర్చిన సీఐ శ్రీనివాస్‌కు పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీనివాస్‌ను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్

తల్లికి వందనంతో వెల్లివిరిసిన ఆనందం

● ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ● త్వరలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం ● మంత్రి సుభాష్



సమావేశంతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలుతో తల్లుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తుందని, ప్రభుత్వానికి తల్లులు వందనం చేస్తున్నారని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం బులుసు కల్యాణమండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. చదువుకు మించి ఆయుధం లేదని, చదువుతో ప్రపంచాన్ని మార్చవచ్చన్నారు. పాఠశాలలు తెరచిన నాటికి సకాలంలో ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేయడంతో విద్యార్థులకు ఉపయోగపడిందన్నారు. వైసీపీ పాలకులు రాష్ట్రంలో 67.27 లక్షల మందికి అమ్మఒడి ఇచ్చామని చెప్పి కేవలం 42 లక్షల మందికి మాత్రమే ఇచ్చారని మంత్రి ఆరోపించారు. ఫీజు రీఎంబర్స్ మెంటు పథకం బకాయిలు పెట్టడంతో కూటమి ప్రభుత్వంపై భారం పడిందన్నారు. తల్లులు లేనివారికి తండ్రి లేదా సంరక్షకుని ఖాతాలో తల్లికి వందనం డబ్బులు జమచేశామన్నారు. పాఠశాలలు తెరచిన రోజే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు అందచేశామన్నారు. రాష్ట్రంలో 9600 ఆదర్శ పాఠశాలల్లో తరగతికో ఉపాధ్యాయుడిని నియమించి విద్యా ప్రమాణాలు మెరుగుకు చర్యలు చేపట్టామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకానికి హాస్టళ్లకు సన్నబియ్యం ఇప్పటికే సరఫరా చేశామన్నారు. గత ప్రభుత్వం నాడు- నేడు పథకంతో నిధులు కాజేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకొచ్చి గాడిలో పెట్టామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం అమలుచేస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి సందడి మరువకముందే

ప్రాణాలు కోల్పోయిన నవ దంపతులు



సాయి,శాలిని ఫైల్‌ఫొటో

వరుడు పిఠాపురం వాసి

విశాఖలో రోడ్డు ప్రమాదం





రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సాయి,శాలిని

మల్కాపురం (విశాఖపట్నం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాళ్ల పారాణి ఆరకముందే.. మామిడి తోరణాలు వాడకముందే.. పెళ్లి నాటి సందడిని మరువకముందే ఆ నవ దంపతులు కానరాని లోకాలకు తరలి'పోయారు'. ప్రేమించుకుని పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్న నెల రోజులకే వారిద్దరూ ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. విశాఖలోని గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి మారుతి జంక్షన్ వద్ద జరిగిన ఈ విషాద సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం ప్రాంతానికి చెందిన జొన్నాడ సాయి (27), విశాఖలోని గంగవరం ప్రాంతానికి చెందిన ఎరిపిల్లి శాలిని (25) గాజువాకలోని బెస్ట్ విజన్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ ప్రేమించుకోవడంతో పాటు పెద్దలను ఒప్పించి పిఠాపురంలో గతనెల 9న వివాహం చేసుకున్నారు. అనంతరం బంధువులకు గాజువాక ప్రాంతంలో విందు కూడా ఇచ్చారు. ప్రస్తుతం దంపతులిద్దరూ గాజువాకలోనే నివాసం ఉంటున్నారు. శనివారం సాయి పుట్టినరోజు కావడంతో సెలవు లేని కారణంగా ల్యాబ్‌లోనే ఉండిపోయారు. ఆదివారం నగరంలోని ఆర్కే బీచ్‌కు వెళ్లేందుకు ములగాడ రోడ్డు మీదుగా ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో మారుతి జంక్షన్ వద్ద ఓ ట్రాలర్ వెనుక నుంచి వీరి వాహనాన్ని బలంగా ఢీకొనడంతో వారిద్దరూ రోడ్డుపై తుళ్లిపడ్డారు. దీంతో సాయి అక్కడికక్కడే మృతిచెందగా, శాలిని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన ట్రాలర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్యతను దెబ్బతీసే విధానాలు మానుకోవాలి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కాకినాడ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పద్మశాలిల ఐక్యతను దెబ్బతీసే విధానాలు మానుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ పేర్కొన్నారు. కాకినాడ రామారావుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంఘ నేతలతో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013లో జరిగిన ఉమ్మడి జిల్లా సమావేశంలో మెజారిటీ సంఘీయుల ఆమోదంతో తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టానన్నారు. అప్పట్లో ఎన్నికలు పెట్టి సంఘీయుల మధ్య చీలిక తేవాలని భంగపడ్డ కొందరు తిరిగి ఇప్పుడు పద్మశాలిల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా తనపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇటువంటి విధానాలు మానుకుని సంఘీయుల కోసం పాడుపడాలన్నారు. ఆలిండియా పద్మశాలి పురోహిత సంఘం గౌరవాధ్యక్షుడు, పద్మశాలి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు ఆమంచి అంజనేయస్వామి మాట్లాడుతూ పద్మశాలిల సంక్షేమం కోసం రామకృష్ణ ఎంతో కృషి చేశారన్నారు. సమావేశంలో డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, పేరిశెట్టి లారయ్య, మేరెడి భాస్కరరావు, నేమాని ఆదివిష్ణు, పొన్నగంటి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

పాములేరు వాగులో గల్లంతైన

యువకుల మృతదేహాలు లభ్యం



సాదిష్, రవితేజ మృతదేహాలు

మారేడుమిల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పర్యాటక ప్రాంతం పాములేరు వాగులో శనివారం గల్లంతైన డి.సాదిష్(23), కటకం రవితేజ(30) మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన యువకులు శనివారం మారేడుమిల్లి ప్రాంతానికి పర్యాటకానికి విచ్చేశారు. వీరిలో సాదిష్, రవితేజ పాములేరు వాగులో స్నానానికి దిగి గల్లంతయ్యారు. శనివారం మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం ఉదయం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ముమ్మర గాలింపు చేయగా వాగులో ప్రమాదకరమైన స్థలం వద్ద వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించి మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సాదిష్ ఫొటోగ్రాఫర్ కాగా రవితేజ కారు ట్రావెల్స్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

జాతీయ స్థాయి పోటీలకు పిఠాపురం బాక్సర్



ఐశ్వర్య సూర్య దీపిక

పిఠాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన జె.ఐశ్వర్య సూర్య దీపిక ఎంపికైంది. విశాఖపట్టణంలో మే 30, 31 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాక్సింగ్ బాలికల పోటీల్లో సూర్యదీపిక 80 కిలోల ప్లస్ విభాగంలో రజత పతకం సాధించింది. స్వర్ణ పతకం సాధించిన విజయనగరానికి చెందిన బాక్సర్ జాతీయ పోటీల నుంచి తప్పుకోవడంతో సూర్యదీపికకు ఆ అవకాశం లభించింది. ఈమె ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు హరియాణా రాష్ట్రంలోని రోహ్‌తక్‌లో జరిగే 6వ జాతీయ స్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. సూర్యదీపిక, ఆమె కోచ్ లక్ష్మణరావులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, కె.పద్మనాభం, కూటమి నాయకులు అభినందించారు.

'అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి

ఉన్నతాధికారులతో కమిటీ నియమించాలి'



అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో అగ్రిగోల్డ్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న సత్తిబాబు

అమలాపురం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉన్నతాధికారులతో కమిటీలను నియమించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేసి తగిన నిధులు కేటాయించాలన్నారు. కోనసీమ జిల్లా అమలాపురం అశోక్‌నగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం పులపర్తి సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి తిరుపతిరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు వీవీ నాయుడు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే అగ్రిఆస్తులు కబ్జాలకు గురయ్యాయన్నారు. పదేళ్ల పోరాట ఫలితంగా రూ.906కోట్లు డిపాజిట్లు చెల్లించడం జరిగిందన్నారు. మిగిలిన రూ.3400కోట్లు బకాయిలను చెల్లించాల్సి ఉందని వివరించారు. ఇచ్చిన హామీ మేరకు న్యాయం జరగకపోతే ఉద్యమబాట పడతామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి లంకేష్, కోశాధికారి శ్రీరామమూర్తి, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన 'లోవ'


రూ.7.17 లక్షల ఆదాయం

తుని రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం అశేష భక్తజనంతో కిటకిటలాడింది. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణానికి చేరుకుని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. మొక్కులు తీర్చుకుని అనంతరం వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి ఆదివారం ఒక్క రోజే రూ.7.17 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో, ఉప కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

రైలు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి




ముత్యాలమ్మ (ఫైల్‌ఫొటో)

తుని రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. తుని మండలం తాళ్ళూరు గ్రామానికి చెందిన గండి ముత్యాలమ్మ (53) తన మనవడు గౌతమ్ చరణ్‌ను వెంటపెట్టుకుని కాకినాడ-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరింది. తునిస్టేషన్ దాటిన తరువాత ఆమెకు వాంతులు అవ్వడంతో డోర్ వద్దకు చేరుకుంది. స్పృహ తప్పి డోర్ నుంచి జారి పడడంతో పాయకరావుపేట మండలం సీతారామపురం సమీపంలో మృతిచెందింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. తుని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సచివాలయ ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ ఏఎన్‌ఎంలకు ప్రమోషన్స్ కం ట్రాన్స్‌ఫర్స్ కోసం ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో 8 మంది వైద్యాధికారుల బృందం ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు కౌన్సెలింగ్ జరిపింది. 400 మందికి 390 మంది హాజరయ్యారు. ఏఎన్‌ఎంలకు ఎంపీహెచ్‌ఏ(ఎఫ్)లుగా ఉద్యోగోన్నతి కల్పించారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వెంకన్న ఆదాయం రూ.7.36లక్షలు

ఆత్రేయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఆదాయం రూ.7,36,300 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు

వెంకన్న జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అంగరలో కొలువై యున్న శ్రీఅలివేలుమంగ గోదాదేవి సమేత శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి వారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్ర పూజలు, అభిషేకాలు, కలశ పూజ, తదితర విశేష పూజలను నిర్వహించారు. అర్చకులు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు స్వామివార్ని అలంకరించారు.

ఆనాటి విలేజ్ అసిస్టెంట్ల ఆత్మీయ సమ్మేళనం


అధికారులుగా ఉద్యోగ విరమణ చేసిన విలేజ్ అసిస్టెంట్స్

అమలాపురం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తొలినాళ్లలో తీసుకువచ్చిన అతి ముఖ్యమైన సంస్కరణల్లో కరణం, మునసబు వ్యవస్థలను రద్దు చేయడం. టీడీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత 1984లో కరణం, మనసబుల స్థానంలో విలేజ్ అసిస్టెంట్ల నియామకానికి ప్రభుత్వం రిక్రూట్‌మెంట్ ఇచ్చింది. దీనిలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 160మందిని అప్పట్లో నియమించారు. ఇప్పటికే వీరంతా తహశీల్దార్లగా, డిప్యూటీ కలెక్టర్లగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసినవారే. రెవెన్యూ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఆనాటి విలేజ్ అసిస్టెంట్ల ఆత్మీయ సమ్మేళనం అమలాపురం వెంకటేశ్వరా ప్లాజాలో ఆదివారం నిర్వహించారు. వేటుకూరి రామలింగరాజు, గుంటు సోమశేఖర్, యల్లమిల్లి శ్రీనివాస్, యనమదల విశ్వేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఉమ్మడి జిల్లాల్లోని సభ్యులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి తాము పని చేసిన హోదాలను పక్కనపెట్టి తామంతా ఒక్కటేనంటూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా నాటి విలేజ్ అసిస్టెంట్ కంభంపాటి శ్రీనివాస్ చేసిన మ్యాజిక్ షో అందరినీ ఆకట్టుకుంది. విధి నిర్వహణలో ఎదుర్కొన్న సమస్యలు, ఉద్యోగ విరమణ అనంతరం చేస్తున్న కార్యకలాపాలపై చర్చించుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో సేనాపతి అప్పారావు, తనికెళ్ల శివానందం, బండి బేబీజ్ఞానాంబ, పాము సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అరబిందో బకాయిలు విడుదల చేయండి

● 104 ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న 104 ఉద్యోగులు

అమలాపురం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గతంలో 104సర్వీసు నిర్వహణా సంస్థ అరబిందో బకాయి పెట్టిన వేతనాలను తక్షణం విడుదల చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పితాని త్రిమూర్తులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ డిమాండ్ చేశారు. సమాన పనికి సమానవేతనం చెల్లించాలని నినాదాలు చేశారు. అమలాపురం సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం 104ఉద్యోగుల జిల్లాశాఖ సమావేశం పలివెల చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రస్తుతం 104సర్వీసులను నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ప్రతీనెల 1వ తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలుచేసి మిగిలిన స్థానాలకు కొత్తగా నియమకాలు జరపాలన్నారు. పాత వాహనాల స్థానంలో కొత్త వాహనాలు అందించడం, మరమ్మతులు చేయించాలని కోరారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న 104వాహనంలో క్షయపరీక్షల నమూనాలను రవాణాచేయడం మంచిది కాదని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సమావేశం సూచించింది. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఓంప్రకాష్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వనచర్ల శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జగ్గీవన్‌రావు పాల్గొన్నారు.

డ్రెయిన్ల ఆధునికీకరణకు చర్యలు: ఎమ్మెల్యే


ఎమ్మెల్యే ఆనందరావును సన్మానిస్తున్న సర్పంచ్ నల్లా బాబండి, రైతులు

ఉప్పలగుప్తం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కోనసీమలో డ్రెయిన్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకున్నట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మండలంలోని మైనర్ డ్రెయిన్ల దుస్థితిపై జనసేన నాయకుడు చిక్కం భీముడు ఆధ్వర్యంలో రైతులు ఆదివారం ఎమ్మెల్యేకు వివరించారు. ఉప్పునీరు పొలాల్లోకి ప్రవహించటం వల్ల సార్వాకు అవకాశం ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. జలవనరుల శాఖ మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వానపల్లిపాలెం సర్పంచ్ నల్లా బాబండి ఎమ్మెల్యేను రైతుల సమక్షంలో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, కూటమి నాయకులు చిక్కం వెంకటకృష్ణ, నల్లా నరసింహారావు, రవణం మధు, సలాది గణపతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

అమలాపురం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ పాటుపడి భవిష్యత్తు తరాలకు మంచి భవిష్యత్తును అందించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పేర్కొన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆదివారం అమలాపురంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణశాఖ అధ్యక్షుడు అరిగెల తేజ వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, కన్వీనర్ మోకా వెంకటసుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్, చిట్టూరి రాజేశ్వరి, చిలకమర్రి కస్తూరి, జగతా శాంతి, కొత్తపల్లి వంశీ, యర్రమిల్లి పాండురంగారావు, కట్టా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టెక్నీషియన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయండి


కేంద్ర మంత్రిని కలిసిన విభా ఈవీ ట్రైనింగ్ సెంటర్ ప్రతినిధులు

ముమ్మిడివరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ వాహనాల టెక్నీషియన్ల శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సంబంధించి విభా ఈవీ ట్రైనింగ్ సెంటర్ ప్రతినిధులు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆదివారం కలిశారు. రాష్ట్రంలో ఎలక్ట్రికల్ వాహనాలకు సంబంధించి టెక్నీషియన్లు సరైన సంఖ్యలో లేకపోవడంతో వాటి వినియోగం తక్కువగా ఉంటుందని, టెక్నీషియన్‌కు సంబంధించి శిక్షణా సెంటర్లు ఏర్పాటు చేసేందుకు విభా ఈవీ ట్రైనింగ్ సెంటర్ ప్రతినిధులు బాలకృష్ణ, సాగర్, తాడి నరసింహారావులు కేంద్రమంత్రి చంద్రశేఖర్‌నుకలిశారు. అమరావతిలో ఆయన నివాస గృహంలో కలిసి టెక్నీషియన్ల శిక్షణ సెంటర్లఏర్పాటు ఆవశ్యకతను వివరించి రాష్ట్ర ప్రభుత్వ సహకారం అందించాలని వారు కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్టు ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రంలో ఐటీఐ, పాలిటెక్నిక్ చదివిన విద్యార్థులకు ఎలక్ట్రికల్ వాహనాలకు సంబంధించి టెక్నీషియన్లగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

వికసించిన బ్రహ్మకమలాలు



మామిడికుదురు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామానికి చెందిన పోలవరపు బాలకిశోర్ ఇంటి పెరట్లో ఐదు బ్రహ్మకమలాలు వికసించాయి. ఐదు బ్రహ్మకమలాలు ఒకేసారి వికసించడంతో ఆ ఇంటి కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసీజన్‌లో ఇప్పటి వరకు 30బ్రహ్మకమలాలు వికసించినట్టుగా బాలకిశోర్ తెలిపారు. ఐదు బ్రహ్మకమలాలను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఘనంగా చింతాలమ్మ జాతర


పాశర్లపూడిలంక గ్రామదేవతను దర్శించుకున్న ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలంక గ్రామదేవత శ్రీచింతాలమ్మ జాతర మహోత్సవాన్ని శనివారం రాత్రి భక్తులు ఘనంగా నిర్వహించారు. భక్తుల కోలాహలం, విచిత్రవేషధారణలు, తీన్మార్ డప్పులు, బాణసంచా కాల్పుల నడుమ జాతర వైభవంగా జరిగింది. ఆదివారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. సోమవారం అమ్మవారి తీర్థం, మంగళవారం సిరిబొమ్మ ఉత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో ఆయన కత్తి తిప్పుతూ కూటమి శ్రేణులతో డ్యాన్స్‌చేసి సందడి చేశారు.

సొసైటీ సీఈవోకు సన్మానం

మలికిపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ జీవితంలో రైతులకు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని రామరాజులంక సర్పంచ్ కాకర శ్రీనివాస్ అన్నారు. రామరాజులంక సొసైటీ సీఈవో దేశినీడి నారాయణరావు ఉద్యోగ విరమణ సభలో పలువురు వక్తలు నారాయణరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆయన్ను పలువురు దుశ్శాలువాతో సన్మానించారు. ఆదివారం దేశినీడి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బొరుసు ఉమారావు, జనసేన నాయకులు దిరిశాల బాలాజీ, గంటా నాయుడు, ముద్దల శ్రీను, బొరుసు సుబ్బారావు, ముద్దల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు



అంతర్వేది, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. నదీ, సముద్ర పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. నిత్యం నిర్వహించే హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం 2,800మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. లైన్‌లో ఉన్న భక్తులకు అసౌకర్యం కలగకుండా సౌకర్యాలను సిబ్బంది కల్పించారు. స్వామివారి ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వివిధ సేవల ద్వారా రూ.1,01,512, అన్నదాన ట్రస్టు ద్వారా రూ.84,224, మొత్తం 1,85,736 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు.

తెలుగుదేశం మండల నూతన కార్యవర్గం



ఉప్పలగుప్తం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఉప్పలగుప్తం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదేశాల మేరకు పార్టీ పరిశీలకుడు, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను ఆదివారం గొల్లవిల్లి అరిగెల వెంకటనరసింహారావు స్వగృహం వద్ద జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ మండల అధ్యక్షుడిగా అరిగెల నానాజీ (గొల్లవిల్లి), ప్రధాన కార్యదర్శిగా పండు వెంకటేశ్వరరావు (కూనవరం), కోశాధికారిగా చల్లపల్లికి చెందిన దంగేటి రవీంద్రనాధ్, ఉపాధ్యక్షుడిగా రాయుడు వెంకటరమణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నందుల సత్తిరాజు, యాళ్ళ సత్తిబాబు, కొల్లు శ్రీనుబాబు, కార్యదర్శులుగా మధుర ప్రతాప్, పలచోళ్ళ నారాయణరావు, ఓలేటి తాతాజీ ఎన్నికయ్యారన్నారు. సమావేశంలో గూడాల విశ్వనాధం, అరిగెల నరేష్, మద్దింశెట్టి సీతారామస్వామి, చీకట్ల ఏసు, కడలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పుదుచ్చేరిలో ఉపరాష్ట్రపతి పర్యటన


ఉపరాష్ట్రపతి ధన్‌కార్‌కు స్వాగతం పలుకుతున్న పుదుచ్చేరి గవర్నర్, సీఎం తదితరులు

యానాం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కార్ పర్యటించారు. మూడు రోజుల పర్యటనకు ఢిల్లీ నుంచి ప్రత్యేకవిమానంలోఆయన పుదుచ్చేరి వచ్చారు. పుదుచ్చేరి విమానాశ్రయం వద్ద ఆయనకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్‌నాథన్, సీఎం ఎన్.రంగసామి, స్పీకర్‌సెల్వం, హోమంత్రి నమశ్శివాయఃతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు.సోమ,మంగళవారాల్లో పుదుచ్చేరిలోని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. దీనికి పుదుచ్చేరి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

నరసింహస్వామిని దర్శించుకున్న బీజేపీ నాయకులు

అంతర్వేది, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణ ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ కార్యాలయంలో చెరుకూరి విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ పదకొండు ఏళ్ల సుపరిపాలన అందించారని, కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, కటికిరెడ్డి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పారావుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు ఐకాన్ అవార్డు



అంబాజీపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తొండవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇంగ్లీషు ఉపాధ్యాయుడుగా పనిచేస్తోన్న ఆదుర్తి వెంకట అప్పారావుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ 2025 ఐకాన్ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత భవన్‌లో ఇటీవల జరిగిన కార్యక్రమంలో అప్పారావు జ్యూరీ మెంబర్ అశోక్‌కుమార్, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, పరిమళ, అంజనీదేవి చేతులు మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. పదేళ్ల నుంచి జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖుల జీవిత చరిత్రలను తెలిపే 80వేలకు పైగా కరపత్రాలను అప్పారావు సొంత ఖర్చులతో ముద్రించి పంపిణీ చేశారు. అప్పారావుకు ఐకాన్ పురస్కారం రావడం పట్ల ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

రొడ్డా భవానీ కేసు.. జాతీయ ఎస్టీ కమిషన్ విచారణ




ఉప్పలగుప్తం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గతంలో చల్లపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎస్టీ మహిళ రొడ్డా భవాని ఆత్మహత్య కేసును ఈనెల 17న జాతీయ ఎస్టీ కమిషన్ విచారణ చేపట్టనున్నట్టు భవాని న్యాయపోరాటసమితి కన్వీనర్ బొంతు రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణ నిమిత్తం సాక్షులను ఢిల్లీకి రావాలని కమిషన్ విజ్ఞప్తి చేసిందన్నారు. అప్పట్లో ఎంపీపీ భర్త, వైసీపీ నాయకుడు దంగేటి రాంబాబు వేధింపుల వల్లే భవాని ఆత్మహత్య చేసుకుందని రమణ ఆరోపించారు. అప్పటి వైసీపీ పెద్దలు ఈ కేసు నుంచి రాంబాబును తప్పించారని, దీనిపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

తెలుగు సాహిత్యాన్ని మలుపుతిప్పిన శ్రీశ్రీ

అమలాపురం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు సాహిత్యాన్ని మరో మలుపు తిప్పిన అభ్యుదయ కవిగా మహాకవి శ్రీశ్రీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని శ్రీశ్రీకళావేదిక జిల్లాశాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి పేర్కొన్నారు. అమలాపురం గాంధీబజార్‌లోని ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో శ్రీశ్రీకళావేదిక, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కష్టజీవికి అటూ ఇటూ ఉన్నవాడే కవి అని ప్రకటించిన మహనీయుడు శ్రీశ్రీ అని కొనియాడారు. శ్రీశ్రీ రచనా శైలిని బీవీవీ సత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో కడలి సత్యనారాయణ, శ్రీపాద రామకృష్ణ, డి.సత్యవేణి, చిక్కాల రవిశంకర్, యేడిద నారాయణరావు, ఆర్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడిగా అడబాల




మలికిపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ అమలాపురం టౌన్ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా పార్టీ మలికిపురం మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్‌ను నియమించారు. ఈసందర్భంగా పలువురు యుగంధర్‌కు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం అంటూ ముద్రించిన పుస్తకాన్ని అమలాపురం శెట్టిబలిజ గ్రంథాలయంలో ఆదివారం ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ వక్తలు మాట్లాడారు. వైసీపీ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు గొల్లపల్లి సూర్యారావు, గన్నవరపు శ్రీనివాసరావు, పిల్లి సూర్యప్రకాష్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, జిన్నూరి బాబి, మట్టపర్తి నాగేంద్ర, వంటెద్దు వెంకన్నాయుడు, కుడుపూడి భరత్‌భూషణ్, కముజు రమరణ, చెల్లుబోయిన నాని పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా నిర్మలకుమార్



అమలాపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా వడాలశెట్టి నిర్మలకుమార్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆయన అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నారు. బాపట్ల కమిషనర్‌గా గతంలో ఆయన పనిచేశారు. పాలనలో మంచి అనుభవం, సమర్థత కలిగిన సక్సెస్‌ఫుల్ కమిషనర్‌గా నిర్మలకుమార్ పేరొందారు. సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

17, 18 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ టవర్ మరమ్మతుల్లో భాగంగా అమలాపురం పరిధిలో ఈనెల17,18 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుందని సూపరింటెండెంట్ ఇంజనీర్ సిద్దెల రాజబాబు తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని 29టవర్ల మరమ్మతులు పూర్తి చేశామని, మరో టవర్‌కు మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాధితులకు సాయం అందజేత

ముమ్మిడివరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): లంకాఫ్ ఠాణేలంక గ్రామానికి చెందిన గుబ్బల రామసత్యనారాయణ-ఉదయలక్ష్మి దంపతులు టీబీ వ్యాధితో బాధపడుతున్నారు. ఎ.వేమవరం నామాలవారి పాలేనికి చెందిన ముషిణి రాంబాబు సహకారంతో నిత్యావసర వస్తువులు, బియ్యం, కాయగూరలు, కిరాణా సామగ్రిని మహిళా నడక యోగా ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షురాలు జల్లి సుజాత చేతులమీదుగా అందజేశారు. ప్రతీనెలా మందులు అందజేస్తున్న సత్యనారాయణను సుజాత అభినందించారు. కన్నెపాముల వెంకటేశ్వరరావు-శ్రీదేవి దంపతులు కూరగాయలు వితరణ ఇచ్చారు. కార్యక్రమంలో గొల్లపల్లి గోపి, చుట్టుగుళ్ల రవి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను కలిసిన నీటి సంఘాల ప్రతినిధులు


మంత్రి రామానాయుడును కలిసిన నీటి సంఘాల ప్రతినిధులు

ఐ.పోలవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును మండలానికి చెందిన నీటి సంఘాల ప్రతినిధులు ఆదివారం పాలకొల్లులో ఆయన స్వగృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. పంటకాల్వలు, డ్రెయిన్ల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను సీఎం దృష్టిలో పెడతానని మంత్రి అన్నారు. మంత్రిని కలిసిన వారిలో మురమళ్ళ, ఐ.పోలవరం, టి.కొత్తపల్లి నీటి సంఘాల అధ్యక్షులు చిలుకూరి సుబ్బరాజు, రాయపురెడ్డి స్వామినాయుడు, నాగబాబు ఉన్నారు.

విఘ్నేశ్వరస్వామి అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన విన్నకోట వికాస్-శ్రీదేవి దంపతులు కుటుంబ సమేతంగా ఆదివారం శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.100,116 విరాళం అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనంచేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ దాతకు స్వామివారికి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

మానవతావాది కామేశమహర్షి

అమలాపురం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వందలాది మంది అనాథలకు ఆశ్రయం కల్పించిన మానవతా వాదిగా కామేశమహర్షి నిలుస్తారని పలువురు వక్తలు కొనియాడారు. అమలాపురం శ్రీకామాక్షీ పీఠం, కామాక్షీ ప్రేమమందిరం వ్యవస్థాపకుడు కామేశమహర్షి సంస్మరణసభ ఆదివారం చారిటబుల్ ట్రస్టు సభ్యుడు వీరా నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. కామేశమహర్షి సేవలను వక్తలు కొనియాడుతూ సనాతనధర్మ పరిరక్షణకు కృషిచేసిన ఆధ్యాత్మికవాదిగా కొనియాడారు. ఎస్ఆర్ఎస్ కొల్లూరి, గోవిందవర్ధుల నాగబాబు, వక్కలంక వాణి, విద్యానిధి విద్యాసంస్థల చైర్మన్ ఆకుల బాపన్ననాయుడు మాట్లాడారు.ఎస్కేబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్, యర్రమిల్లి పాండురంగారావు, కర్రా వీరభద్రం, విస్సాప్రగడ వెంకటరమణమూర్తి, కొరసాలసీతారామస్వామి, భమిడిపాటి కృష్ణమూర్తి, పేరి లక్ష్మీ నరసింహంతో పాటు పీఠం ఉత్తరాధికారి విమనశ రాఖీప్రేమ్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదల పాలిట వరం: ఎమ్మెల్యే దేవ



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ఎన్నో కుటుంబాలకు బాసటగా నిలుస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం విశ్వేశ్వరాయపురంలో ఆయన క్యాంపు కార్యాలయం వద్ద 36మందికి రూ.33,58,870 విలువైన చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే 286మందికి రూ.2.70కోట్లు అందజేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లతో కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువెళుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హమీలన్నీ అమలు చేస్తున్నామని, తల్లికి వందనం ద్వారా ఒకే కుటుంబంలో ముగ్గురు, నలుగురు చదువుకున్నా ఆయా కుటుంబాలకు కూడా రూ.13వేలు చొప్పున నగదు వేశామన్నారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే అర్హతలను బట్టి వారికి కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అడబాల యుగంధర్, చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి, గుబ్బల ఫణి, మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, ఆకన బాబ్జినాయుడు, గుబ్బల రవికిరణ్, ఫణి, ఉండపల్లి అంజి, వీరా రామారావు, అంతర్వేదిపాలెం పుల్లయ్య, జంపన సత్యనారాయణరాజు, ఓదూరి రాజా పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఉప్పలగుప్తం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి పంచాయతీ బందారుపేటకు నాలుగు రోజులుగా తాగునీరందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం ఖాళీ బిందెలతో ఆ ప్రాంత మహిళలు రోడ్డెక్కారు. ఎగువ ప్రాంతాల్లో మోటార్ల ద్వారా తాగునీరు తోడేసుకుంటున్నారని, పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని మహిళలు ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తక్షణం బందారుపేటకు తాగునీరివ్వాలని బీఎస్పీ అమలాపురం ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు డిమాండ్ చేశారు.

'సమస్యలను కాంగ్రెస్ పార్టీ దృష్టికి తీసుకురండి'

యానాం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ఏమస్య ఉన్నా కాంగ్రెస్ పార్టీ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షుడు అర్దాని దినేష్ అన్నారు. యానాం శివారు సావిత్రినగర్‌కు చెందిన సంగాడి అప్పారావు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఆయన పరామర్శించి నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు. ప్రతినిధులు మెల్లం చిన్నా, అశోక్, శ్రీను, కొండబాబుపాల్గొన్నారు.

భాగవత ప్రవచన సప్తాహం

పి.గన్నవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ముంగండ చింతామణి గణపతి మందిరంలో సనాతన ధర్మ వారధి (హైదరాబాద్) ఆధ్వర్యంలో భాగవతం వింటే బాగుపుతాం కార్యక్రమంలో భాగంగా చింతామణి గణపతి నవరాత్రి మహోత్సవ ట్రస్ట్ సౌజన్యంతో లోకకల్యాణార్థం ఈనెల 8నుంచి 14వరకు బ్రహ్మశ్రీ సుసర్ల భగవత్ శాస్త్రి భాగవత ప్రవచన సప్తాహం నిర్వహించారు. ఆదివారం రుక్మిణి కల్యాణంతో ముగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా సనాతన ధర్మ వారధి వ్యవస్థాపకుడు కలవకొలను శ్రీరామచంద్రమూర్తి తన సందేశాన్ని అందించారు. అనంతరం మిర్తిపాటి వెంకటరామయ్య దంపతులు, చింతామణి గణపతి ట్రస్ట్ సభ్యులు గురువులను, ప్రవచన కర్తలను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమానికి సమీప గ్రామాల ప్రజలు, స్థానికులు అధిక సంఖ్యలో విచ్చేశారు.

భార్య, పిల్లల అదృశ్యంపై భర్త ఫిర్యాదు

అమలాపురం రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పేరూరు దూడలవారి వీధికి చెందిన భార్యా పిల్లలు అదృశ్యమైన ఘటనపై భర్త చవ్వాకుల నగేష్ అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ పి.వీరబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్టు ఆదివారం తెలిపారు. నగేష్ భార్య హారతి (24), కుమార్తె నందన (6), కుమారుడు అయాన్‌భార్గవ్ (4) శనివారం మధ్యాహ్నం 3.30గంటలకు ఇంటి నుంచి బయలుదేరి మామిడికుదురు గ్రామంలోని పుట్టింటికి వెళుతున్నామని చెప్పి పిల్లలతో కలిసి బయలుదేరింది. భార్యా పిల్లలు అక్కడ పుట్టింటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన నగేష్ పరిసర ప్రాంతాల్లో ఎంతగాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భార్యా భర్తల మధ్య ఉన్న మనస్పర్థలతోనే పిల్లలతో సహా హారతి అదృశ్యమైనట్టు పోలీసులు భావిస్తున్నారు. తల్లీ పిల్లల ఆచూకీ ఎవరికైనా తెలిస్తే అమలాపురం పట్టణ సీఐ సెల్: 9440796561, పట్టణ ఎస్ఐ సెల్: 7981166996కు సమాచారం అందించాలని సీఐ వీరబాబు కోరారు.

పరామర్శ

మలికిపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురం మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ నాయకుడు చెల్లుబోయిన బులి సత్యం ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను డిప్యూటీ మాజీ స్పీకర్ ఏపీ సూర్యనారాయణరాజు ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట జగడం సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస్, చెల్లుబోయిన బాబూరావు ఉన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.7.36 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.7,36,300 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి కొత్తపేటకు చెందిన నేదునూరి సూర్యనారాయణ, అనంతలక్ష్మి సత్యవతి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

పల్లెసీమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే వేగుళ్ల



ఏడిదలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, కూటమినేతలు

మండపేట, జూన్, 15(ఆంధ్రజ్యోతి): పల్లెసీమల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఏడిదలో పూర్తి చేసిన, చేపట్టిన పలు సీసీ రోడ్లు, డ్రైన్‌లను ఎమ్మెల్యే చేతులు మీదుగా ఆదివారం శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతోందన్నారు. కూటమి పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. గ్రామంలో జరిగిన కార్యక్రమాలకు సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పర్వతిన వీర్రాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, కూటమి నాయకులు మేకా జేజీబాబు, మాజీ సర్పంచ్ యరపోతిన చంటి తదితరులతో పాటు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోని పుంతలు



అధ్వానంగా ఉన్న పుంతరోడ్డు

ఆలమూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పుంత రోడ్లు అధ్వానంగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్వర్యంలో చేపట్టాల్సిన ఈ రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయింపులు చేయకుండా దశాబ్ద కాలంగా వదిలేశారు. వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా ప్రతి ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నప్పటికీ రైతులకు ఉపయోపడే పుంత రోడ్లను గాలికొదిలేయడంతో రైతు లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా పుంతరోడ్లను అభివృద్ధి చేయడానికి ప్రతి సంవత్సరం నిధులు కేటాయింపులు చేసేవారు. ఇటీవల పుంత, లింక్ రోడ్లకు నిధులు కేటాయింపులు చేయకపోవడంతో అధ్వానంగా మారాయి. పంటలను బయటకు తీసుకురావడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. వర్షాల సమయంలో ఎరువులు వంటి వాటిని తీసుకెళ్లడానికి రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం. దశాబ్ద కాలంగా పుంతరోడ్లకు నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి తక్షణం పుంతరోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



కపిలేశ్వరపురంలో స్విచ్చాన్ చేసి షూటింగ్ ప్రారంభిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురంలో సినిమా షూటింగ్ సందడి

కపిలేశ్వరపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ముహూర్తపు షాట్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కెమెరా స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. షూటింగ్ ప్రతినిధులు సినిమా వివరాలను విలేకరులకు తెలిపారు. మన్యత ప్రొడక్షన్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ రవి కిరణ్ కలిదిండి పర్యవేక్షణలో డైరెక్టర్ ప్రసన్న కుమార్ నాని ఆధ్వర్యంలో కథాకళి చిత్రం రూపుదిద్దుకుంటున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి కెమేరామన్‌గా జిబిన్ మోహన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఉపేంద్ర కూన, కాస్ట్యూమ్ డిజైనర్‌గా ముగ్ధ రాచకొండ, ప్రొడక్షన్ డిజైనర్‌గా నాగేంద్ర గువ్వల, మ్యూజిక్ డైరెక్టర్‌గా పవన్ వ్యవహరిస్తున్నారన్నారు. పంచాయతీ కార్యాలయం (పాత భవనం)లో ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్‌లో నిందితుడి ఇంటరాగేషన్ సన్నివేశాలను తొలిషాట్‌గా చిత్రీకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షులు బలవరెడ్డి సత్తిబాబు, టీడీపీ సీనియర్ నాయకులు నెక్కంటి శ్రీరాంజీ, పర్వతిన మురళీకృష్ణ, నామాల బొజ్జియ్య, వంటిపల్లి అబ్బు, మేడిశెట్టి శ్రీను, కె.నారాయణదాసు తదితరులతో పాటు గ్రామ కార్యదర్శి కె.శివచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధిపై ఎమ్మెల్యే బండారు సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రావులపాలెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): టూరిజం అభివృద్ధిపరచడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద టూరిజం ఆర్డీ పవన్‌కుమార్‌తో టూరిజం అభివృద్ధిపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాడపల్లితో పాటు లొల్ల, లొల్లలో ఉన్న దేవదాయ, నీటిపారుదల శాఖల భూముల్లో పర్యాటక రంగ అభివృద్ధి చేయడంపై ఆర్డీతో చర్చించారు. టూరిజం అభివృద్ధికి ఇక్కడ అవకాశాలు అన్ని వినియోగించుకుని అభివృద్ధి పరుచుకునేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బాధితురాలికి అక్షయ సేవా సంస్థ ఆర్థికసాయం

రావులపాలెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్న ఒక బాధితురాలికి అక్షయ సేవా సంస్థ సభ్యులు ఆర్థికసాయం అందచేశారు. ఊబలంకకు చెందిన బొంతు శాంత రత్నానికి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆపరేషన్ చేయించారు. వైద్య ఖర్చులకు వారి ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో అక్షయ సేవా సంస్థను ఆర్థికసాయం కోరారు. సంస్థ సభ్యుడు సత్తి అంజనేయరెడ్డి, స్నేహితులు మెహర్ అవినాస్ అక్షయ సేవా సంస్థ ద్వారా రూ.10వేలు ఆర్థికసాయాన్ని ఆసుపత్రిలో బాధిత కుటుంబానికి అందజేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శాంత రత్నానికి ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

17, 18 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ టవర్ మరమ్మతుల్లో భాగంగా అమలాపురం పరిధిలో ఈ నెల 17, 18 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుందని సూపరింటెండెంట్ ఇంజనీర్ సిద్దెల రాజబాబు తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని 29 టవర్ల మరమ్మతులు పూర్తి చేశామని, మరో టవర్‌కు మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



ప్రత్యేక అలంకరణలో వైభవ వెంకటేశ్వరస్వామి

ఘనంగా వెంకన్న జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న వైభవ వెంకటేశ్వరస్వామి జన్మనక్షత్ర పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో పలువురు రుత్విక్కులు స్వామివార్ని ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు, అభిషేకాలు, కలశ పూజ తదితర పూజలను వేదమంత్రోశ్చరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

మండపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండపేట రూరల్ నూతన ఎస్ఐగా వి.కిషోర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన బుజ్జిబాబు బదిలీ కావటంతో ఆయన స్థానంలో కిషోర్ ఇక్కడ నియమితులయ్యారు. కాకినాడ టూ టౌన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈయన గతంలో అన్నవరం, మోతుగూడెం పోలీసుస్టేషన్‌లలో పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.



ర్యాలి కేశవస్వామి ఆలయంలో మాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా మాస కల్యాణం

ఆత్రేయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి మాస కల్యాణం నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహ వచనం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదిక వద్దకు స్వామివారిని తోడ్కొనివచ్చి శోభయమానంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో అశేష భక్తజనం పాల్గొని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణ మూర్తి వీటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బొబ్బర్లంకకు చెందిన తల్లికి వందనంపై హర్షం వ్యక్తం చేస్తున్న కుటుంబం

నాడు ఒక్కరికి... నేడు ముగ్గురికి

ముగ్గురు పిల్లల తల్లి హర్షం

ఆత్రేయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బొబ్బర్లంకకు చెందిన డొంకిని నవ్య, దుర్గాప్రసాద్ దంపతులకు ముగ్గురు సంతానం. గత ప్రభుత్వంలో ఒక్కరికే అమ్మఒడి అందించారు. కూటమి ప్రభుత్వంలో ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం పథకం ద్వారా రూ.39 వేలు తల్లిఖాతాలో జమయ్యాయి. కుమారుడు ప్రణీత్ 6వ తరగతి, ఇద్దరు కుమార్తెలు కవలలు లిఖిత, నిషిత 2వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనంలో భాగంగా తమ ముగ్గురు పిల్లలకు రూ.39వేలు ఖాతాలో జమ కావడం ఆనందంగా ఉందన్నారు. తమ పిల్లలను బాగా చదివించేందుకు ఈ డబ్బులు ఖర్చు చేస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ఆనందంగా ఉందన్నారు.

విఘ్నేశ్వరస్వామికి భక్తుల పూజలు

అయినవిల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విఘ్నేశ్వరస్వామిని విజయవాడకు చెందిన విన్నకోట వికాస్, శ్రీదేవి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. స్వామివారి అన్నప్రసాద ట్రస్టుకు రూ.100,116 విరాళం అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు.

మోతాదుకు మించి కూర్చోబెట్టినా పట్టదా?

• ఒక్కో ఆటోలో 15 మందికి పైగా ప్రయాణం • చోద్యం చూస్తున్న రవాణాశాఖ అధికారులు



వాడపల్లికి కిక్కిరిసిన ప్రయాణికులతో వెళుతున్న ఆటోలు

ఆత్రేయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు ఎక్కడో ఒకచోట జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ప్రధానంగా మోతాదుకు మించి ఆటోల్లో ప్రయాణిస్తూ ప్రమాదాల బారినపడుతున్న ఉదంతాలు అనే కం ఉన్నాయి. కిక్కిరిసిన ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తున్నా ఆర్‌టీఏ అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆటోల్లో డ్రైవర్‌తో పాటు మరో నలుగురు మాత్రమే ప్రయాణించాల్సి ఉంది. ఒక్కో ఆటోలో డ్రైవర్‌కు ఇరువైపులా ఇద్దరు, వెనుక సీటులో నలుగురు, మధ్య చెక్కలో నలుగురు, వెనుక డోర్‌ను చైనుతో కట్టి మరో నలుగురును ఎక్కించుకుని ఆటోలు పరుగులు పెడుతున్నాయి. ఒక్కొక్క ఆటోలో 15 నుంచి 16 మంది ప్రయాణాలు సాగిస్తున్నారు. దీన్ని నియంత్రించాల్సిన రవాణాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ప్రతి శనివారం వందలాది ఆటోలు వాడపల్లి ఆలయానికి సమీప ప్రాంతాల నుంచి భక్తులను తీసుకువస్తున్నాయి. ఒక్కొక్క ఆటోలో 15 మందికి పైగా ఎక్కిస్తున్నారు. స్వామివారిని దర్శించుకుని త్వరగా ఇంటికి వెళ్లిపోవాలన్న భక్తుల ఆదుర్దాను ఆటోవాలాలు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో మోతాదుకు మించి ప్రయాణికులను కూర్చోబెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదాలు జరగముందే ఆటోడ్రైవర్ల ఇష్టారాజ్యాన్ని కట్టడి చేయాలని పలువురు సూచిస్తున్నారు.



పేరవరం పంపింగ్ స్కీమ్ ద్వారా సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం పేరవరం పంపింగ్ స్కీమ్ ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీటిని స్విచ్చాన్ చేసి పంట పొలాలకు నీరు విడుదల చేశారు. ప్రభుత్వం పంపింగ్ స్కీమ్ మరమ్మతు పనులకు నిధులు విడుదల చేసిందన్నారు. శివారు ప్రాంతాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందుతుందన్నారు. అంకంపాలెం ఛానల్‌కు చేపడుతున్న రిటైనింగ్ వాల్ పనులను ఆయన ప్రారంభించారు. త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. రాజవరంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు అనంతరం శంకుస్థాపన చేశారు. ఎన్నికల హామీలను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కె.జగన్నాథం, కె.రామకృష్ణంరాజు, నీటి సంఘం అధ్యక్షుడు జుజ్జవరపు హరిబాబు, సర్పంచ్ జాన మంగాయమ్మ, నరాలశెట్టి వెంకన్న, కేవీ సుబ్బారావు, మజ్జి సూరిబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి మంత్రి పూజలు

ద్రాక్షారామ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కందులపాలెంలో ఆదివారం జరిగిన కూటమి విజయోత్సవంలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. కందులపాలెం గ్రామ దేవత కనకమహాలక్ష్మి ఆలయాన్ని సందర్శించి పూజలు జరిపారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు వైట్ల గజలక్ష్మి, రాజబాబు దంపతులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మంత్రి కేకు కట్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో మంత్రితోపాటు నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులు, టీడీపీ గ్రామ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకుడు గంధం పళ్లంరాజు, టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, చిగురుపాటి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.



కందులపాలెంలో కనక మహాలక్ష్మి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సుభాష్



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కూటమి ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధి

మండపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం దిశగా పాలన దూసుకుపోతోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఏడిదలో ఆదివారం కూటమి ఏడాది పాలనపై కూటమినేతలు ఏర్పాటు చేసిన విజయోత్సవ సభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాలకు నగదు జమ చేశామన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. కూటమినేతలు ఏర్పాటు చేసిన విజయోత్సవ కేక్‌ను కట్ చేసి వేడుకలను నిర్వహించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేను పలువురు కూటమినేతలు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం



వి.సావరంలో దమ్ము చేస్తున్న ట్రాక్టర్

రాయవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కాలువలకు నీరు విడుదల కావడంతో పాటు ప్రస్తుత వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. రాయవరం మండలంలో 12 గ్రామాల్లో సుమారు 14,500 ఎకరాలు ఆయకట్టు ఉండగా ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు తమ పొలాల్లో సాగుకు శ్రీకారం చుడుతున్నారు. పంటపొలాల్లో బోర్లు, విద్యుత్ మోటార్లు వినియోగించే రైతులు పొలాల్లో నీరుపెట్టి దమ్ము చేస్తున్నారు. కొద్దిశాతం మంది రైతులు విత్తనాలు వేసి నారుమళ్ళ పెంపకం మొదలు పెట్టారు.

అందుబాటులో రైతులకు విత్తనాలు:

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు మండలం పరిధిలో రైతు సేవా కేంద్రాల్లో ఎంటీయూ 7029 వరి స్వర్ణరకం విత్తనాలు 60 కింటాళ్లు, ఎంటీయూ 1318 రకం పది కింటాళ్లు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద స్వర్ణ రకం ఎంటీయూ 7029 రకం 80 కింటాళ్లు, ఎంటీయూ 1318 రకం విత్తనాలు 30 కింటాళ్లు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులు విత్తనాలు ఎంపిక చేసుకునే సమయంలో మంచి విత్తనం ఎంపిక చేసుకోవడం ద్వారా మంచి దిగుబడి సాధించే ఆస్కారం ఉందన్నారు. రైతులంతా త్వరితగతిన నారుమళ్లు సిద్ధం చేసుకోవాలని ఏవో రైతులకు సూచించారు.



రాయవరంలో పొలంలో వేసిన నారుమళ్లు



దాతలకు బీమాపత్రం అందచేస్తున్న మంత్రి సుభాష్

చేయూత స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చేయూత స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో బులుసు కల్యాణ మండపంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ చేయూత స్వచ్ఛంద సంస్థ తలసేమియా బాధితుల కోసం 35 వేల యూనిట్లు రక్తం సేకరించడం పట్ల చేయూత వ్యవస్థాపకులు మొండి రవి కుమార్‌ను ఆయన అభినందించారు. రక్తదానం చేసిన దాతలకు మంత్రి రూ.లక్ష బీమా సర్టిఫికెట్లు అందచేశారు. చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రవికుమార్ మాట్లాడుతూ కేవలం ఆత్మ సంతృప్తి కోసమే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 17న మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని తల్లిదండ్రులు కోల్పోయిన 20 మంది చిన్నారులను దత్తత తీసుకుని వారికి ఉద్యోగం వచ్చే వరకు చేయూత సంస్థ బాధ్యత తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మేడిశెట్టి శేషారావు, శ్రీనివాస్, చొల్లంగి శ్రీధర్, వికాస విద్యాసంస్థల అధినేత వాసంశెట్టి వెంకట రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తల్లికి వందనం పథకం విద్యార్థుల భవిష్యత్‌కు పునాది



కొప్పిశెట్టి వాసు

కపిలేశ్వరపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం విద్యార్థుల బవిష్యత్‌కు పునాది వంటిదని తెలుగు యువత సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ కొప్పిశెట్టి వాసు అన్నారు. ఆదివారం కపిలేశ్వరపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం వల్ల విద్యార్థుల భవిష్యత్‌కు మంచి ప్రయోజనం చేకూరు తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తుందన్నారు. ప్రతిపక్ష నాయకులు అవాస్తవాలు మానుకోవాలని ఆయన తెలిపారు.

విద్యార్థుల హర్షాతిరేకాలు

ఆత్రేయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం డబ్బులు జమకావడంపై విద్యార్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. తాడిపూడిలో ఆదివారం సాయంత్రం తల్లికి వందనం అందుకున్న విద్యార్థులంతా రాష్ట్ర నాయకుల ఫొటోలతో ర్యాలీగా తిరిగి కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుల చిత్రపటాల వద్ద అభినందనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను టీడీపీ నాయకులు కూసంపూడి రామకృష్ణంరాజు తదితరులు ప్రశంసించారు.